క్లుప్తంగా

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిస్వామి

భోగాపురం: గ్రామీణ, పల్లె ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిస్వామి అన్నారు. మండల కేంద్రంలోని మరాడవీధిలో శనివారం ఇంటింటికీ వెళ్లి వైద్యసేవలందించారు. ఈ సందర్భంగా వివిధ రోగాలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దుర్గామహలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు ఉదయ్‌కుమార్, సుజాత, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన

నెల్లిమర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఉపాధ్యాయులు, సచివాలయ సంక్షేమ కార్యదర్శులకు స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రేరణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన అందించగలమన్నారు. బోధనతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. సారిపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి. రాము పలు అంశాలపై ఉపాధ్యాయులకు సూచనలు అందించారు.

రామతీర్థానికి పోటెత్తిన భక్తులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానానికి శనివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు యాగశాలలో విశేష హోమాలు జరిపించి వెండి మంటపం వద్ద సీతారాముల నిత్య కల్యాణం జరిపారు. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మెరకముడిదాం మండలంలోని యాడిక గ్రామానికి చెందిన గౌరీశంకర భక్త జన బృంద సభ్యులు స్వామి సన్నిధిలో చేపట్టిన భక్తి భజనలు భక్తులను అలరించాయి.

ఎన్నికల కోడ్ అమలు చేయాలి

విజయనగరం రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు చేయాలని గ్రామస్థాయి అధికారులు, సిబ్బందిని తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు ఆదేశించారు. మండలంలోని కోరుకొండ, కోరుకొండపాలెం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియామవళిపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్డీ తిరుపతినాయుడు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండలో హౌసింగ్ డే

విజయనగరం రూరల్: మండలంలోని కోరుకొండలో ఎంపీడీఓ గంటా వెంకటరావు ఆధ్వర్యంలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరతగతిన పూర్తి చేసి ఉగాది నాటికి గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు, హౌసింగ్ ఏఈ వర్మరాజు, ఈఓపీఆర్డీ తిరుపతినాయుడు, పీఆర్ మండల ఇంజినీర్ గణేష్, మండలశాఖ అధికారులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

విజయనగరం క్రైమ్: పట్టణంలోని గంజిపేట ప్రాంతంలో శనివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఓ కారు డివైడ్‌రను బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి అతడ్ని ఆటోలో సమీప ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫేక్ చెక్‌పై ఫిర్యాదు

విజయనగరం క్రైమ్: ఫేక్ చెక్‌పై తమకు ఫిర్యాదు అందిందని వన్‌టౌన్ సీఐ బి. వెంకటరావు శనివారం రాత్రి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ధర్మపురికి చెందిన గేదెల రామకృష్ణ ధనలక్ష్మి చికెన్ సెంటర్‌ను నడుపుతున్నాడు. ఇతను బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఈ నెల 10న అకౌంట్ ఓపెన్ చేశాడు. 13 తేదీన రెండున్నర కోట్ల రూపాయల చెక్‌ను బ్యాంక్‌కి సబ్‌మిట్ చేశాడు. ఆ చెక్ గుజరాత్‌కి చెందిన హరి ఓం మొబైల్స్ చెక్ అందజేసినట్లు ఉంది. అకౌంట్ ఓపెన్ చేసి రెండు రోజులు అయిన లోపే రెండున్నర కోట్ల రూపాయల చెక్ ఇవ్వడంతో బ్యాంక్ సిబ్బందికి అనుమానం వచ్చింది. పైగా ఆ చెక్ కూడా బ్యాంక్ ఆఫ్ ఇండియా మంజూరు చేసినది కావడంతో, అక్కడి బ్రాంచి వారితో సిబ్బంది మాట్లాడగా.. అది ఫేక్ చెక్ అని తేలింది. దీంతో బ్యాంక్ సిబ్బంది వన్‌టౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నెరవేరిన ఏళ్లనాటి కల

- అర్బన్ హెల్త్ సెంటర్‌తో అందుబాటులోకి వైద్యం
- రెండేళ్ల కిందట జరజాపుపేటలో ప్రభుత్వాస్పత్రి ప్రారంభం
- పట్టణ వాసులతో పాటు గ్రామీణులకు వైద్య సౌకర్యం
- ఆస్పత్రిలో ప్రతిరోజూ 50 నుంచి 60 మందికి ఓపీ సేవలు



అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యసేవలు అందిస్తున్న వైద్యాధికారి రవీంద్ర, సిబ్బంది



ఆస్పత్రి నూతన భవనం

నెల్లిమర్ల: ఆ ప్రాంతవాసులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన ప్రభుత్వాస్పత్రి ఏర్పాటు కల ఎట్టకేలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నెరవేరింది. ఆస్పత్రి ఏర్పాటుతో ఆ ప్రాంతంతో పాటు చుట్టపక్కల గ్రామాల ప్రజలకు సైతం వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. చికిత్స కోసం నెల్లిమర్ల పట్టణానికి వెళ్లాల్సిన అవస్థలు తప్పాయి. కేవలం ఆస్పత్రిని ఏర్పాటు చేయడమే గాకుండా సేవలందించడానికి అవసరమైన వైద్య సిబ్బందిని కూడా ప్రభుత్వం నియమించింది. వైద్య పరీక్షల నిమిత్తం అవసరమైన ల్యాబ్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. అంతేగాకుండా ఆస్పత్రి నిర్వహణకు అవసరమైన సొంత భవనాన్ని కూడా మంజూరుచేసింది. త్వరలోనే సదరు భవనం అందుబాటులోకి రానుంది. ఇదీ నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధి జరజాపుపేటలో ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన అర్బన్ హెల్త్ సెంటర్‌తో స్థానికులకు కలిగిన ప్రయోజనం. వివరాల్లోకి వెళితే..

అందుబాటులో వైద్యసేవలు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టణవాసులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించడానికి అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంజూరు చేసింది. నెల్లిమర్లలో అప్పటికే సామాజిక ఆరోగ్య కేంద్రం ఉండడంతో సదరు ఆస్పత్రిని జరజాపుపేటలో ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్ణయించారు. నెల్లిమర్ల నగర పంచాయితీగా ఏర్పడక ముందు జరజాపుపేట మేజర్ పంచాయతీగా ఉండేది. అక్కడ ప్రభుత్వాస్పత్రి ఏర్పాటు చేయాలని ఎన్నేళ్లుగానో ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. అర్బన్ హెల్త్‌సెంటర్ ఏర్పాటుతో ఎట్టకేలకు ఆ ప్రాంతవాసుల కల నెరవేరినట్టైంది. రెండేళ్ల కిందట ఓ ప్రైవేట్ భవనంలో వైద్యసేవలు ప్రారంభమయ్యాయి. చికిత్స అందించడానికి ఓ వైద్యాధికారిని కూడా ప్రభుత్వం నియమించింది. అలాగే ఇతర సేవల నిమిత్తం ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఓ ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్ కూడా నియమితులయ్యారు.

ఓపీ సేవలు

అర్బన్ సెంటర్ ల్యాబ్‌లో వివిధ రకాల రక్త, మల, మూత్ర, కఫం పరీక్షలు నిర్వహిస్తున్నారు. మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో పాటు సీబీసీ, హెచ్‌ఐవీ, కొలెస్ట్రాల్, తదితర 72 రకాల పరీక్షలు చేపడుతున్నారు. అలాగే ఈసీజీ సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. ప్రతిరోజూ 50 నుంచి 60 మంది రోగులు ఆస్పత్రికి వచ్చి సేవలు పొందుతున్నారు. కేవలం జరజాపుపేట ప్రాంతానికి చెందినవారే గాకుండా చుట్టుపక్కల గ్రామాలైన పూతికపేట, గరికపేట, కొండగుంపాం, మొయిద, నారాయణపట్నం, తదితర గ్రామాలకు చెందిన ప్రజలు కూడా ఈ ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్నారు. ఆస్పత్రి నిర్వహణ నిమిత్తం కోటి రూపాయలతో ప్రభుత్వం భవనం నిర్మించింది. మరికొద్ది రోజుల్లో ఆ భవనం అందుబాటులోకి రానుంది. నూతన భవనంలో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించడానికి అవసరమైన బెడ్‌లు, ఇతర సామగ్రి ఇప్పటికే సిద్ధమైంది.

మెరుగైన సేవలు..



జరజాపుపేటలో ప్రభుత్వాస్పత్రి ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీగా ఉన్నప్పట్నుంచి కోరుతున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మా కల నెరవేరింది. రెండేళ్ల కిందట ఇక్కడ అర్బన్ హెల్త్‌సెంటర్ ప్రారంభించడంతో మా ప్రాంతంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలకు వైద్యసేవలు అందుతున్నాయి. ఆస్పత్రికి అవసరమైన సొంత భవనం దాదాపు పూర్తయింది. భవనం ప్రారంభమైతే పూర్తిస్థాయిలో సేవలు అందుతాయి.

–సముద్రపు రామారావు, వైస్‌చైర్మన్, నెల్లిమర్ల నగరపంచాయతీ

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

విజయనగరం ఫోర్ట్: బాల్య వివాహాలు చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో జిల్లా బాలల సంక్షేమ సమితి, బాలల సంరక్షణ విభాగం, చైల్డ్‌లైన్ 1098, శిశుగృహ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాల్య వివాహాలను ప్రోత్సహించినా, చేయడానికి ప్రయత్నించినా చర్యలు తప్పవన్నారు. మహిళా సంరక్షణ పోలీసులు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ జి. హిమబిందు, సభ్యులు భవానీ, సుధారాణి, డీసీపీయూ అల్లు సత్యనారాయణ, శిశుగృహ మేనేజర్ త్రివేణి, చైల్డ్‌లైన్ ప్రతినిధులు మీనా, దుర్గ, యాళ్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు పూర్తి చేయండి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ రాము

భోగాపురం: మండలంలోని గృహ నిర్మాణ లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసేలా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కృషి చేయాలని హౌసింగ్ ఏఈ ఆర్.రాము సూచించారు. మండలంలోని గూడెపువలస పంచాయతీలోని జగనన్న కాలనీని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉగాదికి వైఎస్సార్ జగనన్న కాలనీల్లో సామూహిక గృహప్రవేశాలు చేపట్టనున్నందున అందరూ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

28న ఉచిత వైద్యశిబిరం



వాల్‌పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో రాజీవ్‌నగర్ కాలనీ గాయత్రీ భవనంలో ఈ నెల 28వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత మల్టీ స్పెషాలిటీ వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం చైర్మన్ ధవళ వెంకటరావు, డాక్టర్ డీవీ శ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను శనివారం స్థానిక గాయత్రీభవన్‌లో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జనరల్ ఫిజిషియన్స్, చిన్న పిల్లల వైద్యనిపుణులు, డెంటల్, ఆప్తమాలజీ, తదితర స్పెషలిస్టులు ఉచితంగా సేవలందిస్తారన్నారు. అలాగే ఆల్ఫా స్కాన్ ఆధ్వర్యంలో ఉచితంగా రక్తపరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు దామరాజు పర్వతాలు, భోగరాజు సూర్యలక్ష్మి, భోగరాజు ఖాదరవలీ బాబూజీ, ఇనుగంటి రమేష్, మంగిపూడి శివరామయ్య, కేవీఎస్ లక్ష్మి, సత్యకామ్, పేరి రామయ్య పంతులు, ఎస్.రామం, తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాల్లేకుండా సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ కల్యాణి

పూసపాటిరేగ: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మహంతి కల్యాణి అధ్యక్షతన శనివారం జరిగిన సర్వసభ్య సమావేశం ఎటువంటి తీర్మానాలు లేకుండా ముగించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సభలో ఎటువంటి తీర్మానాలు, సమస్యలు ప్రస్తావించలేదు. సమావేశంలో ఎంపీడీఓ జి.రామారావు, వైస్ ఎంపీపీ అల్లాడ రమేష్, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఏఓ కె.నీలిమ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ అలేఖ్య, తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు, అధికారులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం శనివారం వాడీవేడిగా జరిగింది. పలు సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులపై సభ్యులు ధ్వజమెత్తారు. వీధిలైట్ల నిర్వహణ అధ్వానంగా మారిందని, సంబంధిత నిర్వాహక ఏజెన్సీ అస్సలు పట్టించుకోవడం లేదని పలువురు కౌన్సిలర్లు చైర్‌పర్సన్ బంగారు సరోజిని దృష్టికి తీసుకొచ్చారు. నిర్వహణకు అవసరమైన మెటీరియల్, లైట్లు అందుబాటులో లేకపోవడంతో పలు ప్రాంతాల్లోని వీధిలైట్లు వెలగడం లేదని వాపోయారు. ఇప్పటికైనా సదరు ఏజెన్సీ పూర్తిస్థాయిలో మెటీరియల్ సరఫరా చేసేటట్లు చర్యలు చేపట్టాలని, లేని పక్షంలో మార్చాలని డిమాండ్ చేశారు. స్పందించిన వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు సమావేశం నుంచి నిర్వాహక ఏజెన్సీ ప్రతినిధితో ఫోన్లో మాట్లాడి, అవసరమైన మెటీరియల్‌ను వెంటనే సరఫరా చేయాలని ఆదేశించారు.

తాగునీటికి ఇబ్బందులు పరిష్కరించాలి

పట్టణంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి బోర్లు పాడయ్యాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని సభ్యులు కోరారు. అలాగే జరజాపుపేటలోని చాలా కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో తాగునీరు వృథాగా పోతోందని స్థానిక కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

రూ 5.5 కోట్ల బడ్జెట్‌లో కేటాయింపులు ఇలా..

2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ 5.5 కోట్లతో నగర పంచాయతీ బడ్జెట్‌ను గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమోదించారు. సదరు బడ్జెట్‌కు సంబంధించి జనరల్ అకౌంట్ నుంచి రూ. 3.34 కోట్లు, లైటింగ్ అకౌంట్‌లో రూ. 65 లక్షలు, ప్రాథమిక విద్య అకౌంట్‌లో రూ. లక్ష, నీటి పారుదల అకౌంట్‌లో రూ. 1.3 కోట్లు, పట్టణ ప్రణాళిక అకౌంట్ నుంచి రూ. 20 లక్షలు కేటాయిస్తున్నట్లు సమావేశంలో వెల్లడించారు. సమావేశంలో వైస్‌చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, కో ఆప్షన్ సభ్యుడు చిక్కాల సాంబశివరావు, కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, మేనేజర్ విశ్వేశ్వరరావు, ఆర్ఐ కె. త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

జొన్నవలసలో ఫ్యామిలీ ఫిజిషియన్



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ రమణకుమారి

విజయనగరం రూరల్: మండలంలోని జొన్నవలసలో రాకోడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రమణకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దితే వ్యాధులు ప్రబలవన్నారు. గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జగదీష్, శ్రావణి, సీహెచ్ఓ మాణిక్యం, ఎంపీహెచ్ఈఓ రాజు, పీహెచ్ఎన్ రాముడమ్మ, సూపర్‌వైజర్లు శ్రీరామమూర్తి, శ్రీనివాసరావు, జయ, కళావతి, సత్యవతి, ఆరోగ్య సహాయకులు చిన్నారావు, కృష్ణ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజును గెలిపించండి



సీతంరాజు సుధాకర్‌కి మద్దతుగా ప్రచారం చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- ప్రచారం చేపట్టిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. నగరంలోని 39వ డివిజన్ అలకానంద కాలనీలో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు, పట్టభద్ర ఓటర్లు కోలగట్లకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన చూసి సీతంరాజుకు ఓటెయ్యాలన్నారు. పార్టీ జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్, వార్డు కార్పొరేటర్ వింత ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, పట్టభద్రుల ఆదరణ చూస్తుంటే చాలా ఆనందంగా ఉందన్నారు. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చి అమ్మఒడి, విద్యాదీవెన, విదేశీ విద్యారుణం పేరిట ఎంతోమంది విద్యార్థులకు మెరుగైన భవిష్యత్ అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని చూసి ఆయన బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. విజయనగరం నియోజకవర్గంలో 30 ఏళ్లలో ఎన్నడూ జరగని అభివృద్ధిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మూడేళ్లలో చేసి చూపించారన్నారు.త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజు సుధాకర్ విజయానికి పార్టీ శ్రేణులు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యం



గుర్తింపు కార్డులతో మహిళలు

- వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి

విజయనగరం: మహిళలు తమ వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్, దిశ ప్రొటక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు ముళ్లపూడి సుభద్రాదేవి విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక మహారాజా లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పట్టణంలోని మహిళలకు దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు ప్రయాణాలు సాగించే సమయంలో వ్యక్తిగత భద్రత గురించి ఆలోచించాలని సూచించారు. ప్రయాణ విషయాన్ని ఇంటిలో తెలియజేసి వెళ్లాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్‌లో దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు సీహెచ్ పార్వతి, సాయిసంతోషిని, ఇందిర, సత్యలత, తదితరులు పాల్గొన్నారు.

క్రమపద్ధతిలో ఎరువులు వేయాలి

- ఏఓ నిర్మల



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ నిర్మల

డెంకాడ: మొక్కజొన్న సాగు చేసే రైతులు క్రమపద్ధతిలో ఎరువులు వినియోగించాలని మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల అన్నారు. మండలంలోని సింగవరం, లెంకపేట, మహంతిపేట, డెంకాడ, చొల్లంగిపేట, నగరపేట, డి.కొల్లాం, తదితర గ్రామాల్లో శనివారం పర్యటించి మొక్కజొన్న సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా సుమారు 12 వందల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారని చెప్పారు. ఆఖరు ఎరువులో యూరియా, పొటాష్ కలిపి వేస్తే గింజ బాగా తయారవుతుందన్నారు. ఎకరా పొలంలో 25 నుంచి 30 కిలోల యూరియా, 26 కిలోల పొటాష్ కలిపి వేయాలని సూచించారు.

రక్తహీనతపై అవగాహన కల్పించండి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీరాములునాయుడు

- కమిషనర్ శ్రీరాములునాయుడు

విజయనగరం: మహిళల్లో రక్తహీనత లోపం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించాలని వైద్యాధికారులు, ఐసీడీఎస్ అధికారులకు కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు ఆదేశించారు. శనివారం తన చాంబర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రక్తహీనత వల్ల మహిళలు అనేక అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా ప్రసవ సమయాల్లో ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పారు. ఇటువంటి విషయాలపై మహిళలకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకునే దిశగా ప్రయత్నాలు చేయాలన్నారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి సత్యనారాయణ, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

జీవితాలను నాశనం చేసుకోవద్దు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్

విజయనగరం క్రైమ్: మాదకద్రవ్యాల బారిన పడి యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ బి.మధుకుమార్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉన్న బొడ్డు కృష్ణా డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్రగ్స్ విక్రయించినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. మాదక ద్రవ్యాలు జీవితాలను చిత్తు చేస్తాయని చెప్పారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారావు, ఇతర అధ్యాపకులు, సెబ్ కానిస్టేబుల్ గంగాధరుడు, రవికుమార్ పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ అభివృద్ధికి కృషి



బీఎస్ఎన్ఎల్ డీజీఎంను సత్కరిస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

- డిప్యూటీ జనరల్ మేనేజర్ దాలినాయుడు

విజయనగరం టౌన్: బీఎస్ఎన్ఎల్ సంస్థ అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ దాలినాయుడు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక టెలిఫోన్ భవన్‌లో ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామన్నారు అనంతరం ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా జి.శివాజీరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆలుగు వెంకటరావు, సహాయ కార్యదర్శిగా తామాడ కృష్ణకుమారి, కోశాధికారిగా బి. భానుచందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఆర్.రమణమ్మ, అక్కమ్మ, తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం యూనియన్ నాయకులు డీజీఎంను దుశ్సాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్కిల్ కార్యదర్శి కె.రమాదేవి, లచ్చిరాజు పాల్గొన్నారు.